
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




రాజన్న సిరిసిల్ల

5★★★

జిల్లా వార్తలు

బుధవారం 23 జూలై 2025

రేషన్ సంబరం





రేషన్ కార్డు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- రేషన్ కార్డుల పంపిణీకి సీఎం ఆదేశం
- జిల్లాలో ఇప్పటికే మొదలైన ప్రక్రియ
- నూతనంగా 74,615 మందికి లబ్ధి
- పేదలకు అందనున్న సంక్షేమ పథకాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

రేషన్‌కార్డు దరఖాస్తుదారుల ఏడేళ్లనిరీక్షణకు ప్రభుత్వం తెరదించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 14న సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి సోమవారం వీడియోకా న్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లకు రేషన్‌కార్డుల పంపిణీ జూలై 25 నుంచి ఆగస్టు 10వరకు జిల్లాకలెక్టర్ ప్రజాప్రతినిధులు మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ పాల్గొనాలని సూచనలు చేశారు. దీంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకచోట ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పాల్గొనేలా కలెక్టర్ కోఆర్డినేట్ చేసుకోవాలని తెలిపారు. కానీ రాజన్నసిరిసిల్ల జిల్లాలో మాత్రం ముందస్తుగానే రేషన్ లబ్ధిదారుల్లో సంతోషాన్ని నింపారు. జిల్లాలో ఈనెల 17నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ మొదలుపెట్టారు. వేములవాడలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల, వీర్నపల్లి, ఇల్లంత కుంట మండలాల్లో లాంఛనంగా రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలో రేషన్‌కార్డుల పంపిణీతో లబ్ధిదారుల్లో ఉత్సాహం ఏర్పడింది.

కొత్తగా 13,988 రేషన్ కార్డులు

జిల్లాలో ఇప్పటివరకు వచ్చిన 16,775 దరఖాస్తులను పరిశీలించి 13,988 కొత్త కార్డులకు మం జూరు ఇచ్చారు. కొత్తకార్డుల్లో పరిధిలో 42,623మంది లబ్ధిదారుల ఉన్నారు. దీంతోపాటు రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం 33,616 కార్డుల్లో 45,234 మంది తమ పేర్లను కార్డులో చేర్చడానికి దరఖాస్తు చేసుకున్నారు. చాలా కాలంగా చేర్పులు, మార్పులు జరగలేదు. ఈసారి కొత్త కార్డులతో పాటు చేర్పులు, మార్పుల దరఖాస్తులను కూడా పరిశీలన పూర్తి చేశారు. కొత్తగా 31,992 దరఖాస్తుల ద్వారా 43,097మంది లబ్ధిదారులను కార్డుల్లో చేర్చారు. కొత్తకార్డులు, పాత కార్డుల్లో చేర్చిన లబ్ధిదారులు 74,615మంది ఉన్నారు. జిల్లాలో కొత్తరేషన్‌కార్డుల్లో మండలాల్లో బోయిన పల్లిలో 1,071కార్డులు 3,137లబ్ధిదారులు, చందుర్తిలో 819 కార్డులు 2,469 లబ్ధిదారులు, ఇల్లంత కుంటలో 851 కార్డులు 2,593 లబ్ధిదారులు, గంభీరావుపేటలో 911 కార్డులు 2,765 లబ్ధిదారులు, కోనరావుపేటలో 888కార్డులు 2,787లబ్ధిదారులు, ముస్తాబాద్‌లో 1,498 కార్డులు 4,675 లబ్ధిదారులు, రుద్రంగిలో 79కార్డులు 244 లబ్ధిదారులు, సిరిసిల్లలో 2,632కార్డులు 8,090 లబ్ధిదారులు తంగళ్లపల్లిలో1,406కార్డులు 4,258 లబ్ధిదారులు, వీర్నపల్లిలో 326కార్డులు 991లబ్ధిదారులు, వేములవాడరూరల్‌లో 629 కార్డులు 1,908 లబ్ధిదారులు, వేములవాడలో 1,403కార్డులు 4,338 లబ్ధిదారులు, ఎల్లారెడ్డిపేటలో 1475కార్డులు 4,368 లబ్ధిదారులు ఉన్నారు.

సెప్టెంబరు నుంచి రేషన్

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేశారు. జూన్, జూలై, ఆగస్టు బియ్యం పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో కొత్తగా జారీ చేసిన 13,988 కార్డు లబ్ధిదారులతో పాటు పాత కార్డులో చేర్చిన లబ్ధిదారులు 43,097మందికి రేషన్ బియ్యంకోసం సెప్టెంబర్‌కోటా వరకు ఆగాల్సి ఉంటుంది. జిల్లాలో 345 రేషన్ దుకాణాలు ఉండగా 1,77,851 రేషన్ కార్డులు, 5,35,920మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో అంత్యోదయ కార్డులు 13,748, ఆహార భద్రతకార్డులు 1,63,900, అంత్యోదయ అన్నయోజన కార్డులు 203ఉన్నాయి. వీటి పరిధిలో లబ్ధిదారులు 5,35,920మంది ఉన్నారు. ఇందులో అంత్యోదయ లబ్ధిదారులు 37,389మంది, అహారభద్రత లబ్ధిదారులు 4,98,324మంది, అంత్యోదయ అన్నయోజన లబ్ధిదారులు 207మంది ఉన్నారు. వీరికి మూడు నెలల కోటా 9,859.786 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారునికి ఆరు కిలోల చొప్పున మూడు నెలలకు 18కిలోల బియ్యం ఇచ్చారు. దాదాపుగా ఒక్కో కుటుంబాలు..

- మిగతా 8లో

సిరిసిల్లలో తిరంగా ర్యాలీ



జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

సిరిసిల్లటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జెండా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో 300మీటర్ల తిరంగా జెండాతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి విద్యార్థులు తిరంగా జెండాతో పట్టణంలోని ప్రధానరహదారులపై ప్రదర్శన నిర్వహించారు. జాతీయఐక్యతను చాటుతూ భారత సమగ్రతకు ప్రతీకగా దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పల్లె రాజురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై ఏబీవీపీ నిరసన

సిరిసిల్ల రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఒడిస్సా రాష్ట్రంలో విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఉదితశ్ ప్రధాన్ అనే నాయకుడిని ఉరితీయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూజం కార్తీక్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌరస్తాలో మంగళవారం ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒడిస్సాలో విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఎన్ఎస్‌యూఐ నాయకుడిని దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రుద్రవీణ, ధనూష్, విజయ్‌కుమార్, మధుకర్ పాల్గొన్నారు.

నేటి విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్

సిరిసిల్ల రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ కోరారు. సిరిసిల్లలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బుధవారం తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త పాఠశాలలు, జూనియర్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్‌కుమార్, జిల్లా కమిటి సభ్యులు కడారి శివ, నాయకులు జశ్వంత్, సుశాంత్, సాయిశివ, శ్రేయాన్, సాజిద్ పాల్గొన్నారు.

మెదడువాపు వ్యాధిపై అవగాహన

సిరిసిల్ల జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెద్దలు, విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కలిపిస్తూ చేసిన వివిధ రకాల బొమ్మలతో బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మంగళవారం ప్రపంచ బ్రెయిన్ డే సందర్భంగా సిరిసిల్లలోని సృజన్ ఆసుపత్రిలో రాణి ప్రసాద్ తయారు చేసిన బొమ్మలతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు విభిన్నమైన పొడుపు కథల ద్వారా అవగాహన కల్పించారు. మెదడు పనితీరుపై రాసిన వ్యాసాన్ని ఐఎంఏ సావనీర్‌లో ప్రచురించినట్లు రాణీప్రసాద్ తెలిపారు. ప్రతులను ప్రముఖ పిల్లల వైద్యుడు కందేపి ప్రసాద్‌రావు ఆవిష్కరించారు. రాణిప్రసాద్ విద్యార్థుల కోసం పది సైన్స్ పుస్తకాలను ప్రచురించారు. 'డాక్టర్ చెప్పిన కథలు' సంకలనం ప్రాచుర్యం పొందింది.

మద్యపానంతో మానసిక సమస్యలు

సిరిసిల్ల రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మద్యపానం మానసిక సమస్యలను సృష్టిస్తుందని మరమగ్గాల కార్మికులు మద్యానికి బానిసలు కావద్దని పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలని సైకాలజిస్ట్ పున్నం చందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో మంగళవారం మరమగ్గాల కార్మికులకు మైండ్‌కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మద్యపానంతో పాటు మానసిక సమస్యలపై మరమగ్గాల కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైండ్‌కేర్ కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ, ఏనుగుల మనోజ్, కార్మికులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల పట్టివేత : ముగ్గురిపై కేసు

ముస్తాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాలను పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. నందిపేట గ్రామానికి చెందిన గడపర్తి శ్రీనివాస్‌రావు అనే వ్యక్తి తన యజమాని ఓర్సు సాయిమల్లు ఆదేశాల మేరకు వాహనంలో ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు తీసుకువచ్చి నామాపూర్ గ్రామంలో గల శివరాత్రి రాజు అనే వ్యక్తికి బండ పనుల నిమిత్తం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ నటేశ్ ఆధ్వర్యంలో వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌రావు, శివరాత్రి రాజు, ఓర్సు సాయిమల్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శాకంబరీ అలంకరణలో అమ్మవారు



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్ల బొప్పాపూర్ గ్రామాల్లోని దుర్గమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధల మధ్య అమ్మవార్లను శాకంబరీ రూపంలో అలంకరించారు. చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. - ఎల్లారెడ్డిపేట

విద్యార్థులు చదవడం, రాయడంపై శ్రద్ధ పెట్టాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా
- చీర్లవంచ పాఠశాల ఆకస్మిక తనిఖీ

వేములవాడ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని ప్రతి విద్యార్థి చదవడం, రాయడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా ఆదేశించారు. వేములవాడ మండలం చీర్లంచ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా గ్యాస్ సిలిండర్‌పై తయారు చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్యాస్‌సిలిండర్ ఇంకా రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో, ప్రహరీ వెంట మొక్కలు నాటించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. విద్యార్థులకు సరిపడా కంటే ఎక్కువగా అందుబాటులో ఉన్న డెస్కులను అవసరం ఉన్న ఇతర పాఠశాలలకు పంపించాలని సూచించారు.



విద్యార్థిని సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్

రెవెన్యూ ధరఖాస్తులను పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్ : భూభారతి చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ధరఖాస్తులను పరిష్కరించాలని అలాగే జిల్లాలో అక్రమ మైనింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా జిల్లా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం భూభారతి చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులల్లో స్వీకరించిన దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణాపై జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. భూభారతి చట్టంలో భాగంగా ఇటీవల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులల్లో దరఖాస్తుల పురోగతిపై మండలాల వారీగా ఆరా తీశారు. దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. భూభారతిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ అదేశాల మేరకు అర్జీలను పరిష్కారిస్తామని తహసీల్దార్‌లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులు, మున్సిపాల్టీలల్లో వార్డు అఫీసర్‌లు తమ పరిధిలోని ఇందిరమ్మఇళ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. జిల్లాలో ఇసుక , మొరం అక్రమ మైనింగ్‌లపై జిల్లా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సమా వేశంలో అర్డీవో లు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రామచందర్ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఇసుక, మొరం అనుమతులు ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ప్రతిరోజు ఇసుక, మొరం తీసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడారు. జిల్లాలో ఇసుక, మొరం, కంకర, బండ సమయానికి అందక ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు జాప్యం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, సోమ నాగరాజు, ఉప్పునూటి రాజు పాల్గొన్నారు.

భక్తులకు నీటి సౌకర్యం

ఇల్లంతకుంట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భక్తులకు తాగునీటి ఇబ్బందులు పడవద్దని పోచమ్మ ఆలయం వద్ద బోర్‌మోటార్‌ను బిగించినట్లు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఒగులాపూర్ గ్రామ గండ్లె పోచమ్మ ఆలయం వద్ద మంగళవారం కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ నిధులతో బోర్‌వేసి, మోటార్‌ను బిగించినట్లు తెలిపారు. నాయకులు పెంటల వేణు, ఎరుకల రాకేష్, వెంకటేష్ ఉన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ

ఇల్లంతకుంట, జూలై 22(ఆంధ్రజ్యోతి): మహిళలు సంఘటిత శక్తిగా ఎదగడానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో మంగళవారం ఇందిరా మహిళాశక్తి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు రోజురోజుకు ఆర్థిక అభివృద్ధి చెందడం అభినందనీయం అన్నారు. గత ప్రభుత్వం మహిళలు తీసుకున్న రుణాలపై వడ్డీని వసూలు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు వడ్డీ తిరిగి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇల్లంతకుంట ఆదర్శ మహిళా సమాఖ్య జాతీయస్థాయి అవార్డు అందుకోవడం అభినందనీయం అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా ఇల్లంతకుంటలో 50పడకల ఆసుపత్రి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రూ 12కోట్లతో పనులు ప్రారంభిస్తున్నామని, సంవత్సరంలోపు వినియోగంలోకి తెస్తామన్నారు. సమావేశంలో డీఆర్డఓ శేషాద్రి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఫారూఖ్, శ్రీలత, ఎంపీడీఓ శశికళ, వైద్యాధికారిణి జీవనజ్యోతి, ఏపీఎం వాణిశ్రీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ పాశం రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్యయాదవ్,మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జ్ పసుల వెంకటి, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని జవారిపేట, నర్సక్కపేట గ్రామాల మధ్య లోలెవల్ వంతెనను ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రారంభించారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీ, బీమా చెక్కులను అందించారు.



వడ్డీలేని రుణాల చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

అత్యవసర సమయంలో సమాచారం కోసం టోల్‌ఫ్రీ

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, అపద సమయాల్లో జిల్లా అధికారులకు సమచారం అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీనంబర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆపద సమయంలో సేవలను జిల్లా అధికారులకు అందించేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల పాటు సేవలను అందించేందుకు కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్ 9398684240ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అత్యవసర సమయంలో సమాచారం అందించాలన్నారు.

వీఎస్ అచ్యుతానందన్ పోరాటాలు చిరస్మరణీయం

- సిరిసిల్లలో సీపీఎం నాయకుల నివాళి

సిరిసిల్ల రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వీఎస్ అచ్యుతానందన్ స్ఫూర్తి నేటి యువతరానికి, సీపీఎం పార్టీకి శిరోధార్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. కేరళ రాష్ట్ర మాజీముఖ్యమంత్రి సీపీఎం పార్టీ వ్యవస్థాపక సభ్యులు వీఎస్ అచ్యుతానందన్ సోమవారం కేరళ రాష్ట్ర రాజధాని తిరువ నంతపురంలో అనారోగ్యంతో మరణించడంతో మంగళవారం సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనం లో సీపీఎం జిల్లా కమిటీ అధ్వర్యంలో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ 1964 సంవత్సరంలో సీపీఎం పార్టీని ఏర్పాటు చేసిన సభ్యులలో అచ్యుతానందన్ ఒకరని అన్నారు. 2006 నుంచి 2011 వరకు కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో అనేక భూసంస్కరణలు తీసుకవచ్చి వేలాది ఎకరాల భూములను నిరుపేదలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కమిటి సభ్యులు అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, శ్రీరాములు రమేష్‌చంద్ర, గుర్రం అశోక్, మిట్టపల్లి రాజమౌళి, రాపెల్లి రమేష్, నక్కదేవదాస్, సిరిమల్లె సత్యం, జిందం కమలాకర్, కోడం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

వీణవంక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలోని గొల్లపల్లికి చెందిన ఎనగంటి చంద్రయ్య(53) కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. చంద్రయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడినా తగ్గకపోవడంతో కడుపునొప్పి భరించలేక ఈనెల19న పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు చంద్రయ్య భార్య ఎనగంటి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

ద్విచక్రవాహనం కొనివ్వలేదని విద్యార్థి బలవన్మరణం

వీణవంక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన చుక్క ఆదిత్య(17) తల్లిదండ్రులు బైక్ కొనివ్వలేదని పురుగుల మందుతాగాడు. చికిత్సపొందుతూ ఆస్పత్రిలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిత్య ఇల్లందకుంట మండలం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవతరగతి చదువుతున్నాడు. ఈనెల 18వతేదిన సెలవులకు తనకు ద్విచక్రవాహనం కొనివ్వాలని తల్లిదండ్రులను అడిగాడు. కొద్ది రోజుల తర్వాత కొనిస్తానని తల్లిదండ్రులు చెప్పారు. దీనికి ఒప్పుకోక ఆదిత్య 20వ తేదిన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు ఆదిత్య తండ్రి చుక్క సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య


అభిలాష్(ఫైల్)

జూలపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన అంగరి అభిలాష్(27) అనే యువకుడు మద్యం మత్తులో గడ్డి మందుతాగి మృతిచెందాడు. అంగరి రాజేశం మల్లమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు అభిలాష్ ఉన్నాడు. అభిలాష్ మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానుకోవాలని తల్లిదండ్రులు అభిలాష్‌కు ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఈక్రమంలో ఈనెల 20న రాత్రి మద్యం మత్తులో అభిలాష్ గడ్డి మందు తాగి వాంతులు చేసుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు వైద్యంకోసం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి మెరుగైనవైద్యంకోసం కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తుండగానే సోమవారం రాత్రి అభిలాష్ మృతిచెందినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యా దుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


సుమన్(ఫైల్)

ఎలిగేడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అనగోని సుమన్(38) పురుగుల మందుతాగి చికిత్సపొందుతూ సోమవారంసాయంత్రం మృతిచెందాడు. కొన్నేళ్లుగా మద్యానికిబానిసగా మారిన సుమన్ ఈనెల20న వనభోజనాలకు వెళుతానని చెప్పాడని, అనంతరం మద్యం మత్తులో గడ్డి మందుతాగినట్లు భార్యకు తెలిపాడన్నారు. అతడిని చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి,అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


యశ్వంత్ (ఫైల్)

జ్యోతినగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్రాజెక్టుమెటీరియల్ గేట్‌సమీపంలో రాజీవ్‌రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో బోయిని యశ్వంత్(19) మృతిచెందాడు. యశ్వంత్ రోడ్డుదాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనంది. తీవ్రంగా గాయపడిన యశ్వంత్‌ను గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం చనిపోయాడు. ఎన్టీపీసీ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంతటి బరువైనా ఎత్తేస్తారు..



- ప్రతిభ చాటుతున్న పవర్ లిఫ్టర్లు
- ఏషియన్ యూనివర్సిటీ చాంపియన్ షిప్‌లో పతకాలు



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్‌లో వారి ప్రతిభ ఉమ్మడి జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటింది. వందల కేజీలను ఎత్తడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈ విద్యార్థినులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులు తుడి సిరిచందన, శ్యామ్‌రావు ఐశ్వర్య, కుమ్మరి పూజిత ఇటీవల జరిగిన ఏషియన్ యూనివర్సిటీ కప్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని పతకాలను సాధించారు.

ప్రపంచ చాంపియన్‌షిప్ లక్ష్యంగా...


తుడి సిరిచందన

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మల్లిగడ్డ గ్రామానికి చెందిన తుడి శ్రీనివాస్-గంగమ్మ దంపతుల కూతురు తుడి సిరిచందన. ఆమె ప్రతిభను గుర్తించిన కోచ్ బొమ్మ నాతిని మల్లేశం పవర్ లిఫ్టింగ్‌లో ప్రోత్సహించాడు. పది సంవత్సరాల క్రితం పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణను ప్రారంభించిన సిరిచందన అంచలంచెలుగా ఎదిగి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించింది. ఎనిమిది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం, కేరళలో తృతీయ స్థానం, మహారాష్ట్రలో నాలుగో స్థానం, రాజస్థాన్, ఝార్ఖండ్, పంజాబ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. చైనాలోని హాంకాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ జూని యర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. మే నెలలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. ఏషియన్ యూనివర్సిటీ చాంపి యన్‌షిప్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ఆరు సంవత్సరాల సాధన


శ్యామ్‌రావు ఐశ్వర్య

జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన సత్యం-వాణి దంపతుల కుమార్తె శ్యామ్‌రావు ఐశ్వర్య. చిన్ననాటి నుంచి ఆమె క్రీడలు అంటే ఇష్టం. ఈమె అభిరుచిని క్రీడల్లో ఉన్న ఇష్టాన్ని గుర్తించిన తల్లిదండ్రులు పవర్ లిఫ్టింగ్‌లో ప్రోత్సహించారు. ఫలితంగా ఐశ్వర్య పవర్ లిఫ్టింగ్‌లో ఆరు సంవత్సరాలుగా ప్రతిభ చాటుతూ ముందుకు సాగుతోంది.

తెలంగాణలోని సనత్‌నగర్, రామచంద్రాపూర్, మేడ్చల్, ఎల్బీ స్టేడియం, రంగారెడ్డి తదితర ప్రాంతాల్లో జరిగిన పది రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని పలు పతకాలను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెనాలిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. జార్ఖండ్, తమిళనాడు, రాజస్థాన్, కర్ణాటకలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగో స్థానాల్లో నిలిచింది. పంజాబ్‌లో జరిగిన పోటీల్లో వ్యక్తిగత విభాగంలో మూడో స్థానం సాధించింది. మే నెలలో జరిగిన జూనియర్ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. డెహ్రా డూన్‌లోనే జరిగిన ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. భవిష్యత్‌లో ఒలింపిక్స్‌లో భారత పవర్ లిఫ్టింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే తన లక్ష్యంగా ఐశ్వర్య ముందుకు సాగుతుంది.

తిరుగులేని పూజిత...


కుమ్మరి పూజిత

జగిత్యాల జిల్లా కమలాపూర్‌కు చెందిన కుమ్మరి రాజన్న-కవిత దంపతుల కూతురు పూజిత. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆమె ఆరు సంవత్సరాలుగా పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందుతుంది. రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో ఏడు బంగారు, ఐదు రజత, మూడు కాంస్య పతకాలు సాధించింది. పలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన చీఫ్ మినిస్టర్స్ కప్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది. మే నెలలో జరిగిన అంతర్జాతీయ జూనియర్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఏషియన్ యూనివ ర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించింది. మున్ముందు రైల్వేస్, ఇండియన్ ఎయిర్ లైన్స్, బ్యాంక్స్‌లాంటి సంస్థల్లో ప్రవేశించి అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్నదే లక్ష్యమని తెలిపింది పూజిత.

బాలుడితో పని చేయిస్తున్న యజమానిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికుడితో బ్రిక్స్ ఇండస్ట్రీలో పనులు చేయిస్తున్న చందుపట్ల సుధాకర్ రెడ్డిపై గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ముస్కాన్ బృందం మంగళవారం గోదావరిఖని శివారులోని శ్రీలక్ష్మీ బ్రిక్స్ ఇండస్ట్రీని తనిఖీ చేశారు. సదరు పరిశ్రమలో ఒడిశాకు చెందిన 16 ఏళ్ల బాలుడు పనిచేయడాన్ని గుర్తించి యజమానిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మెరుగు శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. లేబర్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు బ్రిక్స్ ఇండస్ట్రీ యజమాని సుధాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

గొల్లపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం లొత్తునూర్ గ్రామ రెవెన్యూ శివారులో అనుమానస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని తనిఖీ చేయగా 90 గ్రాముల గంజాయి పట్టుబడినట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్ రెడ్డి మంగళవారం తెలిపారు. వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన మనోజ్(20) అనే యువకుడు గంజాయి తరలిస్తు పట్టుబడగా అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మనోజ్‌తో ఉన్న మరో యువకుడు సంఘటనాస్థలి నుంచి పారిపోగా, అతడికోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

బాలికల జూనియర్ కళాశాలలో చోరీ

జగిత్యాల క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో చోరీ జరిగింది. దొంగలు విద్యార్థులకు సంబంధించిన నోట్ పుస్తకాలను అపహరించుకు వెళ్లారు. తరగతి గదుల్లోని ట్యూబ్ లైట్లతో పాటు ఫ్యాన్లను ధ్వంసం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి రామగుండం కాంగ్రెస్ నాయకుడు మహంకాళిని కించపరిచే విధంగా వీడియోలను పోస్టుచేసిన కేసులో రామగుండం ఎన్టీకాలనీకి చెందిన జరుపుల శ్రీనివాస్‌ను మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాస్ గతంలో ఒక ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్‌లో పనిచేసేవాడని, అనంతరం ఒక రాజకీయపార్టీలో క్రియాశీలకంగా పని చేశాడన్నారు. అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటూ సోషల్ మీడియాలో గ్రూపులను క్రియేట్ చేసి ఆపరేట్ చేస్తున్నాడన్నారు. సోషల్‌మీడియాలో అనవసరమైన పోస్టులు పెడుతూ రెండు రాజకీయపార్టీల మధ్య ఘర్షణలకు దారి తీసేలా ప్రయత్నించాడన్నారు. రామగుండం జనహిత, పాలకుర్తి మండలం, నిజం నిప్పులాంటిది పేర ఫేస్‌బుక్‌లో అకౌంట్ క్రియేట్‌చేసి కించపరిచే పోస్టులు పెట్టాడన్నారు. మహంకాళి స్వామి ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి మంగళవారం నిందితుడిని అరెస్టు చేశామన్నారు. సోషల్ మీడియాను మంచి సమాచారానికి వినియోగించేలే తప్ప అసత్యప్రచారాన్ని పోస్టు చేసేందుకు వినియోగించరాదన్నారు. అలాంటి పోస్టులు పెట్టేవారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఒకరి రిమాండ్

జగిత్యాల క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకుని పెళ్లి కోసం బాలికను కిడ్నాప్ చేసిన కేసులో యువకుడికి జగిత్యాల కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. బీర్‌పూర్ మండలానికి చెందిన ఓ బాలికను జిల్లా కేంద్రానికి చెందిన నవీద్‌ఖాన్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. పెళ్లి పేరుతో ఈనెల 20న కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తీసుకువెళ్లాడు. పోలీసులుకిడ్నాప్‌నకు పాల్పడ్డ యువకుడిని మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ వివరించారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

- పీజీ మెడికో దుర్మరణం
- మరో నలుగురికి గాయాలు
- జూబ్లీనగర్ ఎల్లమ్మ గుడి వద్ద ఘటన


రాహుల్‌రామిరెడ్డి(ఫైల్)


బోల్తాపడిన కారు

కరీంనగర్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ ఓ పీజీమెడికోను బలిగొనగా, మరోనలుగురు మెడికోలు గాయపడ్డారు. కరీంనగర్‌లోని చామనపల్లి-జూబ్లీనగర్‌లోని ఎల్లమ్మటెంపుల్ మధ్య ప్రమాదకరమైన మూలమలుపు ఉంది. ఈ దారిలో నెమ్మదిగా వెళ్లాలి. పీజీవిద్యార్థులు ఎప్పటిలాగే రోడ్డు బాగా ఉందనుకొని వేగంగా వెళ్లారు. మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో నుంచి కిందపడిన సమయంలో ఏటూరి రాహుల్‌రామిరెడ్డి అనే పీజీమెడికో తలకు బండతగలడంతో తీవ్రగాగాయపడి మృతిచెందాడు. మిగతావారికి స్వల్పగాయాలయ్యాయి. గంటకు 60కిలోమీటర్లపైన వేగంఉన్న సమయంలో ప్రమాదం జరిగితే ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకుంటాయి. ప్రమాదానికి గురైన ఈ కారులో ఎయిర్‌బ్యాగ్‌లు తెరచుకోలేదు. కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. కరీంనగర్‌రూరల్ మండలం చామనపల్లి-జూబ్లీనగర్ మధ్య రోడ్డుపై కారు అదుపుప్పి బోల్తాపడిన ఘటనలో ప్రతిమ వైద్యకళాశాలలో పీజీ చదువుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు చెందిన ఏటూరి రాహుల్‌రామిరెడ్డి(24) దుర్మరణం చెందాడు. కారులోప్రయాణిస్తున్న మరోనలుగురు పీజీ విద్యార్థులకు గాయాలయ్యాయి. కడపకు చెందిన ఏటూరి రాహుల్‌రామిరెడ్డి, గుంటూరులోని శ్యామలనగర్‌కు చెందిన మోపిదేవి జయంత్, కర్ణాటకలోని రాయ్‌చూర్ జిల్లా చిందంటౌన్‌కు చెందిన కడియ వినయ్‌చౌదరి, హైదరాబాద్ ఎల్‌బీనగర్‌కు చెందిన ఎం.పృథ్వీరాజ్, సిద్దిపేటలోని మోయిన్‌పురకు చెందిన బి.పృథ్వీరాజ్ కరీంనగర్‌లోని ప్రతిమ వైద్యకళాశాలలో పీజీ మొదటిసంవత్సరం చదువుతున్నారు. వీరంతా నగునూర్‌లోని కళాశాల హాస్టల్‌లోనే ఉంటున్నారు. సోమవారం సెలవుకావడంతో ఐదుగురు ఎక్స్‌యూవీ-700 కారు(కేఏ 36 జెడ్ 3980)లో ఉదయం 10గంటలకు బొమ్మకల్ శివారులోని చల్మెడ వైద్యకళాశాలలో స్నేహితులను కలిసేందుకు వెళ్లారు. తిరిగి అదేకారులో రాత్రి 1:30గంటలకు ప్రతిమ కళాశాలలోని హాస్టల్‌కు బయలుదేరారు. జూబ్లీనగర్ ఎల్లమ్మ దేవాలయం వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్టును ఢీకొని బోల్తాపడింది. దీంతోకారులో వెనుకవైపున కూర్చున్న రాహుల్‌రామిరెడ్డి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న జయంత్‌తోపాటు మిగతాస్నేహితులకు స్వల్పగాయాలయ్యాయి. వారంతా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. అతివేగం, అజాగ్రత్తగా కారు నడపడంతోనే ప్రమాదం జరిగిందని ఏటూరి రాహుల్‌రామిరెడ్డి సోదరి పోలీసులకు ఇచ్చినఫిర్యాదులో పేర్కొన్నట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

నీటి గుంతలో పడి కార్మికుడి మృతి

పెగడపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం నందగిరి గ్రానైట్ క్వారీలో మంగళవారం ఉదయం నీటి గుంతలో పడి కార్మికుడు సాని (19) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌కు చెందిన సాని మండలంలోని నందగిరి శివారులోని మైత్రి గ్రానైట్ క్వారీలో పనిచేస్తూ మంగళవారం ప్రమాదవశాత్తు క్వారీలోని నీటి గుంతలో పడి మృతి చెందాడు. మృతుని అన్న సోమా ఫిర్యాదు మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎల్.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

నీటి సంపులో పడి వృద్ధురాలు మృతి

తంగళ్లపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు చెన్నం బాలవ్వ(82) నీటి సంపులో పడి మృతి చెందింది. మంగళవారం తెల్లవారు జామున ఇంటి పనులు చేస్తూ బాలవ్వ ఇంటి ముందు ఉన్న నీటి సంపులో నుంచి నీటిని తోడే క్రమంలో సంపులో పడి మృతి చెందింది. బాలవ్వ నీటి సంపులో పడి ఉండడాన్ని గమనించిన భర్త బాపురెడ్డి స్థానికుల సహాయం కోరడంతో గమనించగా అప్పటికే బాలవ్వ మృతి చెందింది. ఈ సంఘనపై పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేలుడు పదార్థాల పట్టివేత

- ముగ్గురిపై కేసు నమోదు


పట్టుబడిన వ్యక్తులతో సీఐ నటేశ్, ఎస్సై గణేశ్

ముస్తాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాలను పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై గణేశ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. నందిపేట గ్రామానికి చెందిన గడపర్తి శ్రీనివాస్‌రావు అనే వ్యక్తి తన యజమాని ఓర్సు సాయిమల్లు ఆదేశాల మేరకు తన టాటా వాహనంలో ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు తీసుకువచ్చి నామాపూర్ గ్రామంలో గల శివరాత్రి రాజు అనే వ్యక్తికి బండ పనుల నిమిత్తం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ నటేశ్ ఆధ్వర్యంలో దాడులు చేసి వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌రావు, శివరాత్రి రాజు, ఓర్సు సాయిమల్లు అనే ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


విద్యుదాఘాతానికి గురై తీగపై వేలాడుతున్న వంశీ

జగిత్యాలరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన ఇరుగదిండ్ల వంశీ(25) అనే యువకుడు ప్రమాదవశాత్తు 11కెవి విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మంగళవారం మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం వంశీ అనే యువకుడు గ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన ఇంటి పైన బట్టలు ఆరవేసేందుకు మంగళవారం బిల్డింగ్ ఎక్కాడు. బట్టలు ఆరవేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బిల్డింగ్ పక్కనగల 11 కేవీ విద్యుత్ వైర్లు వంశీకి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజు సైతం సంవత్సరం క్రితం చేపల వేటకు వెళ్లి చేపలు పడుతుండగా విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుడి పెద్దనాన్న ఇరుగదిండ్ల సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

సొంత భవనాలకు మోక్షం ఎప్పుడు?

- అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- స్థలం ఉన్నా నిర్మించని వైనం
- మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు.. అయినా నిర్మాణాల ఊసే లేదు


ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్(ఫైల్)

గన్నేరువరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలంగా ఏర్పడి ఎనిమిదేళ్లు అయినా ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలకు నోచుకోవడం లేదు. పరిపాలనా సౌలభ్యం కోసం మండలాలను ఏర్పాటు చేయడం బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వ కార్యలయాల భవనాలు, మౌళిక సదుపాయాలను కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని ప్రజలు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో తహసీల్దారు కార్యాలయాన్ని అద్దెభవనంలో నిర్వహిస్తుండగా, ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌లోని కొన్నిగదులలో మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి భవనంలో పోలీస్‌స్టేషన్‌ను కొనసాగిస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని రైతువేదికలో నిర్వహిస్తున్నారు. ఇందులో కొన్ని ఇరుకైన భవనాలు కాగా, కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్నప్పటికీ విధులు నిర్వర్తించడం తప్పడం లేదంటూ కొందరు ఉద్యోగులు వాపోతున్నారు. మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రభుత్వ స్థలంలో నిర్మించేందుకు ఇటీవలే నిర్మాణపనులను ప్రారంభించారు. నిత్యం వందలాది మంది వివిధ అవసరాల కోసం మండల కేంద్రానికి వస్తుంటారు. వారికి అవసరమయ్యే కార్యాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయో అడిగి తెలుసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

మండల కేంద్రానికి చెందిన జువ్వాడి మన్‌మోహన్‌రావు మండలకేంద్రంలో పోలీస్‌స్టేషన్ కోసం ఎకరం పదిగుంటలు, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల కోసం 30గుంటలు మొత్తం రెండుఎకరాల భూమిని ప్రభుత్వానికి విరాళంగా అందించారు. మండలం ఏర్పడిన కొద్దిరోజులకే ఈ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల పేరిట మన్ మోహన్‌రావు రిజిస్ట్రేషన్ చేయించినా నేటికీ నిర్మాణాల ఊసేలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకొని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించి, అన్ని సౌకర్యాలు కల్పించి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

జగిత్యాల క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించడంతో పాటు బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం చెల్లించాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి మంగళవారం తీర్పునిచ్చారు. జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి మర్రిపెల్లి సాయినాథ్(24) అనే యువకుడు 2021లో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ శ్రీను, ఎస్సై రవీందర్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు రంజిత్, రాజు, శ్రీధర్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణరావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కవ్వంపల్లి రాములు



సుభాష్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా కవ్వం పల్లి రాములును నియమిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈఎఫ్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాములు నియామకం పై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఏకాగ్రత ముఖ్యం

భగత్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బస్సు డ్రైవింగ్‌లో ఏకాగ్రత ముఖ్యమని ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ అన్నారు. మంగళవారం బస్‌స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో డ్రైవర్ల రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కరీంనగర్ రీజియన్‌లో ప్రమాదాలు రేటు గణనీయంగా తగ్గిందన్నారు. డ్రైవర్లు ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండాలన్నారు. మద్యానికి దూరంగా ఉండడం, సమతుల ఆహారం తీసుకోవడం, వేగ నియంత్రణ పాటించడం వంటి పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు ఎస్. భూపతిరెడ్డి, జి. సత్యనారాయణ, సైకాలజిస్టు నాగేశ్వర్‌రావు, కరీంనగర్ ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఆహ్లాదకరం నరసింహుడి క్షేత్రం



గుట్టపై పచ్చదనం



గుట్ట కింద ఉన్న పచ్చని పొలాలు

భక్తులను ఆకర్షిస్తున్న నల్లగొండ ఆలయం

పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటున్న భక్తులు

కొడిమ్యాల, జూలై 22(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన గుట్టపైనున్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆహ్లాదకరంగా ఉండి భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతోంది. శ్రావణ మాసంలో ఎగువ, దిగువ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. చుట్టూ పచ్చని పొలాలు, చెట్లతో వందలాది ఎకరాల విస్తీరణంతో నల్లని గుట్ట ఆవరించి ఉన్నది. భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. గుట్ట పైన ఆలయం సమీపంలో విశాలమైన పరుపు బండ, వాహనాల పార్కింగ్‌కు అనుకూలంగా ఉన్నది. కింది ఆలయం నుంచి గుట్టపైకి ఫార్మేషన్ రోడ్డు ఉన్నప్పటికీ నర్సింహస్వామికి మొక్కుకున్న భక్తులు మెట్ల మార్గం ద్వారా పైకి నడుచుకుంటూ వెళ్లి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. ఆలయం ముందు కోనేరులో నీరు ఎప్పుడూ ఉంటుంది. కింది ఆలయ పరిసరాల్లో 16 వసతి గదులు ఉన్నాయి. 1969 లో ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడి పల్లి సత్యం ప్రత్యేక చొరవ తీసుకొని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయటానికి కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.. ప్రతి ఏడు మాఘ వ మాసంలో నిర్వహించే బ్రహ్మోత్స వాలకు వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనాన్ని చేసుకుంటారు. ప్రతి మాఘ పౌర్ణమికి స్వామి వారి రథోత్సవం వైభవంగా జరుగుతుంది. గుట్ట కింద వర్షాకాల ప్రారంభ సమయంలో పరిసర గ్రామాల ప్రజలు వన భోజనాలు చేస్తారు.



నర్సింహస్వామి వెలసిన ఎత్తైన గుట్ట

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్,జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల (అటానమస్) కరీంనగర్‌లో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఖాళీల వివరాలను వెల్లడించారు. తెలుగు-5, ఇంగ్లీష్-8, కామర్స్-2, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ -6, బీబీఏ-3, బిజినెస్ ఎనలిటిక్-2. బీకాం ఫైనాన్స్-1, బీకాం రిటైలింగ్-1, డాటా సైన్స్-1, బీసీఏ-2, ఫిషరీస్-1, స్టాటిస్టిక్స్-1, క్రాప్ ప్రొడక్షన్-1, మైక్రోబయాలజీ-1, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్-1, ఎకనామిక్స్-1, పొలిటికల్ సైన్స్-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, జువాలజీ-1, బోటనీ-1, ఫుడ్ సైన్స్ క్వాలిటీ కంట్రోల్-1 చొప్పున ఖాళీలు ఉన్నట్లు వివరించారు. కమిషనర్ ప్రొసీడింగ్స్ ఆదేశాలకు లోబడి, పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు, నెట్, సెట్, పీహెచ్‌డీ, టీచింగ్‌లో అనుభవం ఉన్న వారికి వెయిటేజీ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటల లోపు ఎస్సారార్ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని, ఒరిజినల్ సరిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 2025-26 విద్యా సంవత్సరం గెస్ట్ లెక్చరర్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి మంగళవారం ప్రకటనలో తెలిపారు.తెలుగు, ఇంగ్లీష్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్, వృక్షశాస్త్రం, జంతు శాస్త్రం, మైక్రో బయాలజీ, ఫిజిక్స్ స్టాటిస్టిక్స్ సబ్జెక్టులో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 25 సాయంత్రం 5 గంటలలోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 26వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు

తాళం వేసిన ఇంట్లో చోరీ

వీర్నపెల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇంటి తాళం పగుల గొట్టి చోరీ చేసిన ఘటన మద్దిమల్లలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిమల్ల గ్రామానికి చెందిన చందనపు బ్రహ్మయ్య ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగుల గొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తొమ్మిది గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి, రూ30 వేలు చోరీకి గురైనట్లు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు.

కానిస్టేబుళ్లకు టెక్నాలజీపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ వినియోగంపై దశలవారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీపీ గౌస్ ఆలం తెలిపారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక శిక్షణతోపాటు, టెక్నాలజీపై పట్టు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. వారం రోజుల శిక్షణలో భాగంగా, పిటిషన్ డ్రాఫ్టింగ్ నుంచి ఛార్జిషీట్ దాఖలు వరకు పలు అంశాలపై ఉంటుందని వివరించారు. నేరాల ఛేదనలో సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు విజయ కుమార్, వేణుగోపాల్, ఐటీ కోర్ కార్యాలయ సీఐ సరిలాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల సబ్ జూనియర్ బాక్సింగ్ క్రీడకారుల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలకు రెండు జిల్లాల నుంచి 80 మంది హాజరయ్యారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హైదరాబాద్‌లోని షేక్‌పేటలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. పోటీల నిర్వహణను ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, కొత్తకొండ సంపత్ కుమార్ పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, తహసీల్దార్ మడిపల్లి కాళీచరణ్, సీనియర్ క్రీడాకారులు ప్రవీణ్, మురళి, రంజిత్, రాజేందర్, కోచ్ రామకృష్ణ అభినందించారు.



రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన కరీంనగర్, పెద్దపల్లి జిల్లా క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ జిల్లా నుంచి బాలుర విభాగంలో ఎం.సాయిదత్తు, శశివదన్, మహేష్, టి.రాహుల్, ఆర్.అఖిల్, కె.రితేష్, జోషిత్, భరద్వాజ్, దుర్గరాజు, అఫ్రిది, సయ్యద్ జమీల్ అహ్మద్, ఆది ఆర్యాన్, బాలికల విభాగంలో జి. హరిణి, మడిపల్లి నక్షత్ర ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా నుంచి కె.సూర్య ప్రతాప్, సీహెచ్ జస్వంత్, అద్విత్, శివ, ఒ.సాయి విక్రమ్, ఎం.కృష్ణ, రేవంత్, ఎం.అజయ్ కుమార్, సీహెచ్ అశ్విత్, రుక్షిత్, టి.సాహిల్, బాలికల విభాగంలో కె.అక్షర, బి.రిషి, చరణ, పి.వర్షిత ఎంపికయ్యారు.

నీటి కోసం రైతుల రాస్తారోకో



కథలాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

కథలాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వరద కాలువకు కాళేశ్వరం నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కథలాపూర్‌లో రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. కథలాపూర్, బొమ్మెన, దూలూరు, చింతకుంట, భూషణరావుపేట, సిరికొండ, దుంపెట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల నుంచి వందలాదిగా రైతులు మండల కేంద్రానికి తరలివచ్చి ఆందోళన చేపట్టారు. ప్రాజెక్ట్‌ల్లో నీరు ఉన్నప్పటికీ వరద కాలు వకు నీటిని పంపింగ్ చేయడం లేదని ఆరోపించారు.

ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పంటలు కళ్ళ ముందే ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్దార్ వినోద్, సీఐ సురేశ్‌కుమార్ రైతులను సముదాయించే ప్రయత్నం చేసినా రైతులు వినక పోవడంతో ఆర్డీఓ జివాకర్‌రెడ్డితో రైతు నాయకులను ఫోన్‌లో మాట్లాడించారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతానని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, గడ్డం భూమారెడ్డి, పిడు గు ఆనందరెడ్డి, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు



మెట్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

మెట్‌పల్లి రహదారిపై..

మెట్‌పల్లిటౌన్: సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం మెట్‌పల్లిలో జాతీయ రహదారిపై, ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మెట్‌పల్లి పట్టణంతో పాటు మెట్‌పల్లి మండలంలోని వెల్లుల, బండలింగాపూర్, పెద్దాపూర్, రేగుంట, ఇబ్రహీంపట్నం గ్రామాలకు చెందిన రైతులతో పాటు రైతు సంఘం నాయకులు పోలీస్ స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. మెట్‌పల్లి సీఐ అనిల్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐలు కిరణ్ కుమార్, అనిల్‌లు రైతుల వద్దకు చేరుకొని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అన్నవరం దేవేందర్

కరీంనగర్ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కవి అన్నవరం దేవేందర్ రాష్ట్ర ప్రభుత్వ దాశరథి కృష్ణమాచార్య సాహిత్య పురస్కారం అందుకున్నారు.మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ తెలంగాణ మట్టి పరిమళాన్ని ప్రపంచ వ్యాప్తంగా తన కవిత్వంతో పరివ్యాప్తం చేస్తున్న కవి అన్నవరమని కొనియాడారు. అనంతరం అన్నవరం మాట్లాడుతూ దాశరథి ధిక్కార స్వరాన్ని అందిపుచ్చుకొని అమానవీయ పరిస్థితులపై కవిత్వాన్ని రాస్తున్నట్లు చెప్పారు. ఈ పురస్కారానికి ఎంపిక చేసిన నిపుణుల కమిటీకి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి



గంగాధర, జూలై22 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులపై సీఎంతో చర్చించినట్లు ఆయన తెలిపారు. కొండగట్టు అంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి, నారాయణపూర్ రిజర్వాయర్‌ను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

భూతగాదాలో యువకుడిపై దాడి

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఇబ్రహీంపట్నం, జూలై22 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఇబ్రహీంపట్నం మండలం మూల రాంపూర్ గ్రామానికి చెందిన గూడ రవి(36)పై గూడ గంగాధర్ దాడి చేయడంతో సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై అనిల్ కథనం ప్రకారం గూడ గంగాధర్, గూడ రవిలు బంధువులు కాగా వీరికి గ్రామంలోని 12గుంటల వ్యవసాయ భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 9న గూడ గంగాధర్ తన పొలంలో ఒడ్డు చెక్కుతుండగా అక్కడికి వచ్చిన రవి తన పొలంలో హద్దు దాటి ఒడ్డు చెక్కుతున్నావని ప్రశ్నించగా గొడవ మొదలైంది. గంగాధర్ చేతిలో ఉన్న పారతో రవిపై దాడిచేయగా తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం నిజామాబాద్‌లో మృతిచెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమస్యలకు చెక్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఆధునికీకరణ

ఇన్వర్టర్లు, కంప్యూటర్లు, ఇతర పరికరాల ఏర్పాటు



కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇన్వర్టర్, బ్యాటరీలు

తిమ్మాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చి పెట్టడంలో రిజిస్ట్రేషన్ శాఖ ముందు వరుసలో ఉంటుంది. అలాంటి శాఖకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో కావల్సి వసతులు లేవు. రాష్ట్రప్రభుత్వం ఈ శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే అన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయకు నూతన కంప్యూటర్లు, ప్రింటర్లు, విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధిక సామర్థ్యం ఉన్న ఇన్వర్టర్లును ఏర్పాటు చేస్తోంది.



తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం

రోజురోజుకు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో క్రయ విక్రయ దారులతో కిక్కిరిసిపోతోంది. విద్యుత్, ఇతర సమ స్యలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. కంప్యూటర్లు, ఇతర పరికారాలు పాతబడిపోవడంతో పనులు త్వరగా అయ్యేవి కావు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు అసహనం వ్యక్తం చేసేవారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే తిరిగి వచ్చే వరకు పనులకు అంతరాయం ఏర్పడేది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నూతన కంప్యూటర్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడిన పనులకు ఇబ్బంది కలగకుండా ఇన్వర్టర్లు, పెద్ద మొత్తంలో బ్యాటరీలను అమర్చుతోంది.

కంప్యూటర్లు, ఇతర పరికరాలు బిగించారు


పార్థసారథి, సబ్ రిజిస్ట్రార్, తిమ్మాపూర్



రాష్ట్రంలో అన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ప్రభుత్వం ఆధునీకరిస్తోంది. దీనిలో భాగంగా తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయా నికి నూతనంగా ఆరు కంప్యూటర్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఇన్వర్టర్లు, బ్యాటరీలు, ఇతర పరికరాలను మంజూరు చేసింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా ఇన్వర్టర్ల ద్వారా పనులు పూర్తి చేస్తున్నాం. గతంలోలాగా ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయంలో ఎక్కువ సేపు వేసి చూడల్సిన పరిస్థితి లేదు.

ఈ నెల 27న రాజన్న కోడెల పంపిణీ

వేములవాడ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలలోని కోడెలను ఈ నెల 27వ తేదీన పంపిణీ చేయనున్నట్లు ఆలయ ఈవో రాధాబాయి, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలో ఉదయం 8.30 గంటల నుంచి 200 కోడెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఆనుకుని ఉన్న జిల్లాలోని చిన్న, సన్నకారు అర్హులైన రైతులకు అందిస్తామని స్పష్టం చేశారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డ్‌తో పాటు సరైన ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కోడెల పంపిణీ రోజున సరైన ధ్రువ పత్రాలతో రావాలని సూచించారు. అర్హులైన రైతులకు జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.



భక్తులు వెళ్లే క్యూలైన్‌లో అడ్డుగా పడుకున్న కుక్క

రాజన్న ఆలయం వెలవెల

ఆషాఢంలో తగ్గిన భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయం మంగళవారం భక్తులు లేక వెలవెలబోయింది. ఆషాఢ మాసం కావడంతో రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ కనిపించ లేదు. దీంతో ఆలయ ఆవరణ ఎక్కడ చూసినా బోసి పోయి కనిపించింది. క్యూలైన్‌లు ఖాళీగా దర్శన మిచ్చాయి. రానున్న శ్రావణమాసంలో భక్తుల రద్దీ పెరుగనుంది.

క్యూలైన్‌లో శునకాలు

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. భక్తులు విడిది చేసే స్థలాల్లో, క్యూలైన్‌ల వద్ద సంచరించడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. దర్శనానికి వెళ్లే క్యూలైన్‌లో, లడ్డూలు తీసుకునే క్యూలైన్‌లో శునకాలు ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.



భక్తులు లేకవెలవెల బోతున్న రాజన్న ఆలయం

రేషన్ సంబరం

(5వ పేజీ తరువాయి)

నలుగురు ఉంటే 72 కిలోలు, ఆరుగురు ఉంటే 108కిలోల వరకు సన్న బియ్యం వచ్చాయి.

ప్రభుత్వ పథకాలకు తొలగిన ఆటంకం

ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పొందాలంటే రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో కొన్నే ళ్లుగా కార్డులేక సంక్షేమ పథకాలకు అనేక మంది దూరం అయ్యారు. కనీసం కార్డులో చేర్పులు, మార్పు లకు కూడా అవకాశం లేకుండా పోయింది. 2018లో నిలిచిపోయిన రేషన్ కార్డుల ప్రక్రియతో ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యాస్‌సబ్సిడీ, ఉచితకరెంట్, గ్యారంటీ పథకాలు అందుకోలేక పోయారు. కొత్తకార్డులు అందించడంతో ప్రభుత్వ పథకాలు పొందడానికి ఉన్న ఆటంకం తొలగిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



జ్యోతిప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో మహిళా బ్యూటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేకప్, హెయిర్ పే ఒక్క రోజు సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు ఎంచుకున్న రంగాల్లో రాణిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు.

అడ్‌హక్ కమిటీ సభ్యులు చర్చలు జరపాలి

సిరిసిల్ల టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో రెండవ పద్మశాలి సంఘం అంకురార్పణ కాకముందే అడహక్ కమిటీ సభ్యులు చర్చలు జరపాలని పద్మశాళి సంఘం రాష్ట్ర నాయకులు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికల నిర్వహణ కోసం పెద్ద మనుషులే అడహక్ కమిటీ వేసుకున్నారని రాష్ట్ర పద్మశాలి సంఘం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీగాద మైసయ్య, గుంటు మహేష్, గోనె ఎల్లప్ప పాల్గొన్నారు.

స్థాయికి మించి విమర్శలు చేయడం సరికాదు

ఎల్లారెడ్డిపేట, జూలై22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు తమ స్థాయికి మించి విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో అధికారులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కారని ఆరోపించారు. బండలింగంపల్లి మాజీ సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమావేశంలో నాయకులు రాజ్‌కుమార్, బాబు, శ్రీకాంత్, మల్లారెడ్డి, మహేందర్, బుచ్చాగౌడ్, మల్లారెడ్డి, ఇమాం పాల్గొన్నారు.

ప్రొటోకాల్ గురించి మాట్లాడితే పోలీసులకు ఫిర్యాదు ఎందుకు

ఎల్లారెడ్డిపేట, జూలై22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్‌ను విస్మరించడంపై మాట్లాడితే తనపై కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడం ఎందుకని బండలింగంపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు బాలరాజునర్సాగౌడ్ ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డుల అందజేత

ఎల్లారెడ్డిపేట, జూలై22(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులను మంగళవారం అందజేశారు. పాఠశాలలో పని చేస్తున్న శివకుమార్ మిత్రులు చైతన్య, అజయ్, హరికృష్ణ, నరేశ్, కరుణాకర్, రాజు, బాలాజీ, వేణులు కలిసి రూ.15 వేల విలువైన టై, బెల్ట్, ఐడీ కార్డులను సమకూర్చారు.

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం

సిరిసిల్ల క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా పౌర, కుటుంబ వివాదాల పరిష్కారమే లక్ష్యమని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికర సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ అన్నారు. మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి పి. నీరజ సూచనలతో 40గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమం కోసం ఆసక్తి గల న్యాయవాదుల జాబితా పంపించామన్నారు.

ఘనంగా బోనాలు

సిరిసిల్ల టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌లోని శుభోదయం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం విద్యార్థులు ఘనంగా బోనాలను జరుపుకున్నారు. విద్యార్థులు శివసత్తులు, పోతరాజు వేషాలతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్‌యాదవ్, ఇంచార్జి లావణ్య, అకాడమీ ఇంచార్జి సాయిప్రియ, ధనుశ్రీ, జ్యోతి, కల్పన, స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు వేణు

రుద్రంగి జూలై 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సంసిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు కర్ణావత్తుల వేణు అన్నారు. రుద్రంగిలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, ఓబీసీమోర్చా జిల్లా అధ్యక్షులు నంద్యాడపు వెంకటేష్, అల్లూరి అశోక్ రెడ్డి, పడాల గణేష్, రాసురి నర్సారెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు కృషి

కోనరావుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషి చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాలకార్ బాలాజీ అన్నారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో ఎంపీ నిధులతో బోరుబావి వేయించారు.

ఘనంగా ఫ్లాగ్ డే వేడుకలు

వేములవాడ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకుంటూ జాతీయ జెండా దినోత్సవం వేములవాడ పట్టణంలోని స్కై స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి పాఠశాలలో జాతీయ జెండా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండాను చేతిలో పట్టుకొని ప్రదర్శన చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఫీవర్ సర్వే

కోనరావుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట వైద్యాధికారి వేణు మాధవ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించారు. నిమ్మపల్లి హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ పాలన ఆర్భాటాలకే పరిమితం

ఇల్లంతకుంట: రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలన ఆర్భాటాలకే పరిమితమైందని జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కృషితో 50పడకల ఆసుపత్రి మంజూరైందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన వంతెనను ఎమ్మెల్యే ప్రారంభించారని విమర్శించారు. గ్రామసభ ద్వారా ఎన్నికైన డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులను తొలగించి ఇతరులకు కేటాయించారన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని, రెసిడెన్షియల్ విద్యాసంస్థలలో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం హైదరాబాద్ సచివాలయం నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీఎస్ రామకృష్ణారావులతో కలసి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం నిబంధనల ప్రకారం వీలైనంత వరకు భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి భూ సమస్యలపై తీసుకున్న దరఖాస్తులను నాలుగు కేటగిరీలుగా విభజించి వాటిని నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ లక్షల మంది పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వం నమ్మకంతో పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలకు పంపుతున్నారని అక్కడ జరిగే చిన్న చిన్న సంఘటనల కారణంగా ప్రభుత్వంపై విశ్వాసం తగ్గే ప్రమాదం ఉన్నదని అప్రమత్తంగా ఉండాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో పిల్లలకు భోజనం అందించే అంశంలో ప్రభుత్వం జారీ చేసిన కామన్ డైట్ మోనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు విద్యాసంస్థలలో మౌళిక వసతులను కల్పించాలన్నారు. విద్యాసంస్థల పరిసరాల ప్రాంతాలలో పిచ్చిమొక్కలను పూర్తిస్థాయిలో ఉపాధి పనుల ద్వారా తొలగించాలన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా అధికారులు రెగ్యులర్‌గా పాఠశాలలను తనిఖీ చేస్తూ విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో అర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజమనోహర్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయితీ అధికారి షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

బీజేపీతోనే గ్రామ స్వరాజ్యం

జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

ముస్తాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతికుమార్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల మండల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ బీఆర్ఎస్, వైఖరి, కాంగ్రెస్ వైఖరి ఒక్కటేనని అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థలను రెండు పార్టీలు నిర్వీర్యం చేశాయన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఎమ్మెల్యే సిఫార్సుల ద్వారా సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతి, శ్రీనివాస్ రావు, అంజాగౌడ్, సంజీవ్, మల్లీశ్వరి కోల కృష్ణ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న మోహన్ రెడ్డి

రుద్రంగి జూలై 22(ఆంధ్ర జ్యోతి): అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ సహకార యూనియన్ చైర్మన్ మనాల మోహన్‌రెడ్డి అన్నారు. రుదంగి మండల కేంద్రంలోని మానాలలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులను పంపిణీ చే శారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులై రేషన్ కార్డు లేని ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్, ఎంపీఓ రాజేశం, హౌసింగ్ ఏఈ రాజమౌళి, నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి జక్కు వంశీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, నాయకులు జక్కు మోహన్, లక్కాకుల రమేష్, జక్కుల లక్ష్మీనారాయణ, జూల దిలీప్, లింగారెడ్డి, గురుదాస్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



వికాస్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్తపని చేయాలని బీజేపి నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. వేములవాడ మండలం నందికమాన్ వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందని అన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితులను గాలికి వదిలేసిందని, పరిహారం రాని నిర్వాసితులకు మొండి చేయి చూపిందని అన్నారు. ఉపాధి లేక నిర్వాసితులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని అన్నారు. రాబోవు రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులను గెలింపించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం హయంలో ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలో గ్రామాలకు వచ్చే నిధులను కార్యకర్తలు గ్రామగ్రామానికి తీసుకువెళ్లి వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ నాయకులు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, జింక అనిల్‌కుమార్, సంతోష్ యాదవ్, గుండెకార్ల లక్ష్మణ్, ఏరెడ్డి రాజిరెడ్డి, గోనే భాస్కర్ ఉన్నారు.

సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ విఫలం

వేములవాడ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా మరోసారి నిరూపించాలని ఆ పార్టీ మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వేములవాడ మండలంలోని చింతలఠాణ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల హామీల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో ఎలా విజయం సాధించాలనే విషయాలను కార్యకర్తలకు వివరించారు. మాజీ ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, మాజీ వైస్ ఎంపీపీ ఆర్సీ రావు, అభిమన్యు, రెడ్డవేని పర్శరాములు, బండారి శ్రీనివాస్, రాసూరి రాజేశం తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

కోనరావుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుల జారీతో పేదవారి కళ నెరవేరిందని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. మంగళపల్లిలో మంగళవారం రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాదినేని బాలరాజు, అవురం సురేష్, బి. శేఖర్, ఎం పరశురాములు, ఎం మల్లేశం, మల్లేశం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపాలని పార్టీ నుంచి కార్యకర్తలకు, సంపూర్ణ మద్దతు ఉంటుందని చొప్పదండి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భరోసా ఇచ్చారు. బుధవారం బోయినిపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారంతో సంబంధం లేకుండా గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగిరేలా నాయకులు కృషి చేయాలన్నారు. భారత దేశ చరిత్రలో అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేక పోతోందని, వాళ్ల ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా ప్రారంభించలేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, వైఫల్యాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలను మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందన్నారు. ఇప్పటి వరకు చొప్పదండి నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామంలో పూర్తిగా రుణమాఫీ జరుగలేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాజీ ఎంపీపీ సత్తినేని మాధవ్, సింగిల్ విండో చైర్మన్ తీపి రెడ్డి కిషన్ రెడ్డి, నాయకులు గుంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కోనరావుపేట: మండలంలోని మంగళపల్లె తారు రోడ్డు నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. పంచాయతీరాజ్ జిల్లా క్వాలిటీ డీఈ ప్రవీణ్ కుమార్, ఏఈ సాయికృష్ణ తదితరులు ఉన్నారు

వేములవాడ టౌన్ : స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన రాజు అనే వ్యక్తి మద్యం మత్తులో ఆసుపత్రికి వచ్చి వీరంగం సృష్టించాడు. పోలీసులు రాజును అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

వేములవాడ టౌన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఫకీర్‌బాబు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాడు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య శ్రీధర్‌రావు, ప్రసాద్, కృష్ణప్రసాద్ ఉన్నారు.

రుద్రంగి: ప్రభుత్వ పాఠశాలలలో నెలకొన్న మౌలిక సమస్యలను, ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బూర సదానందం డిమాండ్ చేశారు. పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు.

గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా ఆషాఢమాస వనభోజనాలకు తరలివెళ్లారు. ఏడుపాయలు, చాముండేశ్వరీమాత, వీరభద్రస్వామి, హనుమాన్ తదితర ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గంభీరావుపేట పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు బచ్చు కృష్ణమూర్తి,ప్రధాన కార్యదర్శి మందుల రవి తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన జిల్లా నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కేటీఆర్‌ను కలిసిన ఏనుగు మనోహర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావును బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన ఇంటిలో కలిశారు. చలో గన్‌పార్క్ కార్యక్రమానికి హైదరాబాద్‌కు జిల్లా కేంద్రం నుంచి బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అనంతరం హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసానికి వెళ్లి ఈ నెల 24న కేటీఆర్ జన్మదినం పురష్కరించుకొని ముందస్తుగా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు తెలంగాణ ఉద్యమకారులు మామిడాల రమణ, బింగి ఇజ్జగిరి, అంజనేయులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను బీఆర్ఎస్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి కలిశారు. హైద్రాబాద్‌లోని నందినగర్‌లో కేటీఆర్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్లు మనోహర్‌రెడ్డి తెలిపారు.

పవర్‌లూమ్ కార్మికుల ధర్నా



టెక్స్‌టైల్ పార్కు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

తంగళ్లపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కూలీ సమస్య, యార్న్ సబ్సిడీ, త్రిఫ్ట్ పథకం డబ్బులు విడుదల చేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ ఎదుట కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న చేనేత జౌళి శాఖ ఏడీ రాఘ వరావు అక్కడికి చేరుకుని సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించి ఏడికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పవర్‌లూమ్ వర్కర్ యూనియన్ అధ్యక్షుడు కోడం రమణ, టెక్స్‌టైల్ పార్క్ యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, జెల్ల సదానందం, ఆడెపు రవి, సంపత్, రాజమల్లు, శ్రీకాంత్, అంజనేయులు, కనకయ్య, వరప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు



సిరిసిల్లలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహిం చారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్ర పాణి, చీటి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎంపీపీ చిలక పెంటయ్య, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు బత్తుల కమలాకర్, సిరికొండ మల్లయ్య, మార్త గంగాధర్ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సీత్యానాయక్, సందీప్, మురళీమోహన్‌గౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట :మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయడం సిగ్గుచేటు : సీపీఐ

సిరిసిల్ల టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కేటీఆర్ ముందు చూపుతో నిర్మించిన చెక్ డ్యాంలో నీరు నిలిచి అలుగులు దూకుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుందర్శన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం సిరిసిల్ల - తంగళ్లపల్లి మధ్య మానేరు వాగులో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన చెక్ డ్యాంలు తెగిపోగా వాటిని సీపీఐ నాయకులు పరిశీలించారు. బీఆర్ఎస్ హయాంలో రూ.110 కోట్లతో మానేరు వాగులో మొత్తం తొమ్మిది చెక్ డ్యాంలను నిర్మించిందన్నారు. నాణ్యత పాటించక ఏడు చెక్ డ్యాంలు కొట్టుకుపోయాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పంతం రవి, కడారి రాములు, సోమనాగరాజు, జంగం అంజయ్య, మీసం లక్ష్మన్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో ప్రైవేటు విక్రయాలు



లడ్డూల కౌంటర్ వద్ద కవర్లు విక్రయిస్తున్న వ్యక్తి

వేములవాడ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఓ ప్రైవేటు వ్యక్తి దర్జాగా విక్రయాలు నిర్వహిస్తున్నాడు. రాజన్న ఆలయానికి వచ్చి ప్రసాదం తీసుకునే భక్తులకు క్యూలైన్ వద్ద కవర్‌లను విక్రయిస్తున్నాడు. ఒక కవర్‌కు రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తూ భక్తుల వద్ద దండుకుంటున్నాడు. భక్తులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన కవర్‌లను గోదాంలో నిరుపయోగంగా పడేశారని, ఓ ప్రైవేట్ వ్యక్తి ఆలయంలో కవర్‌లను ఎక్కువ ధరలకు దర్జాగా విక్రయించినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు చొరవ తీసుకుని సీఎమ్ఆర్ షాపింగ్ మాల్ వారు అందించిన కవర్లను భక్తులకు ఉచితంగా అందించాలని, లేదా విక్రయానికి టెండర్ నిర్వహించి టెండర్‌దారు ద్వారా తక్కువ ధరకు భక్తులకు అందేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా దాశరథి జయంతి

వేములవాడ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలంతో పాటుగా పట్టణంలోని పలు పాఠశాలలో దాశరథి కృష్ణమాచార్య జయంతి ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ మైనార్టీ రెసిడెన్సియల్, న్యూఅర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహాకవి దాశరథి ఒక ఉద్యమం, ఆయన కవిత్వం తిరుగుబాటు, ఆయన పాట ధిక్కారమని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ అన్నారు. మైనార్టీ రెసిడెన్సియల్‌లో ఉపాధ్యాయులు చోలేశ్వర్, శారద, ఎల్లేష్, ప్రవీణ, ప్రసాద్, భరత్, శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట ప్రాంత రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కోరారు. మూలవాగు పొంగుతుండడంతో నిజామాబాద్ మామిడిపల్లి మూలవాగు ప్రాంతంలో భారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాగు ఉధృతికి ఏర్పాటుచేసిన తాత్కాలిక మరమ్మతులు కొట్టుకుపోవడంతో ప్రమాదం జరిగే పరిస్థితి ఉందన్నారు. అందుకే ముందస్తుగా ఇటుగా ఎవరూ వెళ్లకుండా భారీకేడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.